
# తిరునాళ్ళు

ఏడుకొండలవానికి తలనీలాలిచ్చిన యాత్రికునిలా వెలుగుతున్నాడు చంద్రుడాకాశంమీద. ఆవేళ పౌర్ణమి వెళ్ళిన మర్నాటి పాడ్యమి. రైల్వే ప్లాట్ ఫారంనిండా పాడ్యమిచంద్రుళ్లెందరో తీర్థయాత్ర ముగించుకుని పట్నం పోయే రైలుకోసం యెదురుచూస్తున్నారు. శేషావతారం ప్లాట్ ఫారం మీద వెల్లకిలా పడుకున్నాడు తలకింద చిన్నమూట - దాంట్లో ప్రసాదమూ, పువ్వులూ వున్న పొట్లమూ, బట్టలూ వున్నాయి. మూటను నెత్తికిందికి సరిగ్గా సర్దుకుంటూ శేషావతారం ఒక్కసారిగా ప్లాట్ ఫారం అంతటినీ కలియచూశాడు - స్టేషన్ కెదురుగా వున్న కొట్లల్లో మరచెంబు కొనితెస్తానని వెళ్లిన పురుషోత్తం ఇంకా వచ్చేజాడలేదు. ఇంకా బండిరావడానికి ఒక గంటుంది - మళ్ళీ నిర్మలాకాశంలో కృష్ణపక్ష పాడ్యమీ చంద్రుడికేసి చూడ్కులు నిగుడించాడు - క్రమంగా అతని చుట్టుపక్కల జనసందోహాన్ని ఒత్తిగించుకుని అతని దృష్టిగోళంలో భావపరంపరలు మబ్బుల్లాగా వస్తూ కమ్ముకుంటూ, మళ్ళీ వెల్తురు చిమ్ముకుంటూ విడిపోతూ, మళ్ళీ చుట్టుపక్కల జనసందోహాపు గొణుగులు వినబడుతూ, మళ్ళీ తోసుకుపోతున్నాయి.

ఎందుకు చేస్తారో జనమంతా ఈ యాత్రలు - అన్ని దేశాల్లోనూ అన్ని జాతుల ప్రజలూ చేస్తారా? ఈ ముప్ఫయి మూడుకోట్ల జనంగల పుణ్యభూమాత పుత్రులకు మాత్రమే పుణ్యం కలిగి, మిగిలిన ప్రపంచంలోని ఇతర జాతులకి దీని ప్రమేయం ఎందుకులేదో అని ఆలోచించాడు శేషావతారం. మళ్ళీ ఆలోచనల మబ్బులు విడి పాడ్యమీ చంద్రగోళపు వెలుగులోంచి పక్కనున్న పాశ్చాత్య సోదరుడొకాయన కెమేరాతో ప్లాట్ ఫారంమీద సిద్ధమయాడు. తెల్లవారగట్ల కొండెక్కుతున్నప్పుడు కూడా ఈయన తొందరగా మెట్లెక్కలేక మధ్యమధ్య మజిలీలు చేస్తూ వస్తున్న తన్ను చూసి హెచ్చరిస్తూ మాట్లాడాడు. తన స్నేహితుడు పురుషోత్తం ఆయనకన్నీ ఇంగ్లీషులో బోధపరుస్తూ రావడం, మధ్యదారిలో ప్రాచీన చారిత్రిక రాజధానీ, కొండలోయల్లో సూర్యోదయం, మనోహరదృశ్యాలు ఆయనగారు ఫోటోలు తీయడం, అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి - పురుషోత్తం యింకా మరచెంబు కొనుక్కు వచ్చినట్టులేదు - ఆయన మాత్రం ఎవరితోటో మాటాడుతున్నాడు. వాళ్ల దేశాల్లో కూడా ఏవో యాత్రలున్నాయట - మతం పేరుచెప్పి కొన్నీ, చరిత్ర పేరు చెప్పో, భూగోళం పేరు చెప్పో, ఏ కొండో, ఏ అడివో, ఏ నదో, సముద్రపు వొడ్డో ప్రజలు ఆరోగ్యానికీ, విశ్రాంతికీ వినోదానికీ పోయివస్తుంటారట - అయితే మనదేశంలో మిగిలిన అన్ని కారణాల కన్నా మతం కారణంగానే ఎక్కువ యాత్రలుండడానికి కారణంకూడా ఆయన చెప్పిందే జ్ఞాపకానికి వచ్చింది శేషావతారానికి. మీది ఆధ్యాత్మిక దేశం అన్నాడాయన - మీ ప్రజల్లో చాలామంది ఋషులూ, మహాపురుషులూ, మంత్రవేత్తలూ ఉన్నారన్నాడు పురుషోత్తంతో—

## రజని

“అరే, ఈ విషయం మనకీ మొదటి నుంచీ తెలుసుగాని, మనం వాళ్లనిగురించి ఆలోచించడమే పల్లేదే ఇన్నాళ్లనుంచీని” అనుకున్నాడు శేషావతారం. అయినా, పొద్దున్న పురుషోత్తం నోరుజారిపోయి ఒకమాట అనేశాడు ఆపాశ్చాత్యుడితో—‘వాడలా ఎందుకన్నానా’ అనుకుంటున్నాడిప్పుడు—శేషావతారం! “ఋషులూ, మహాపురుషులూ మాట దేవుడికి తెలియాలి కాని, బ్లాక్ మార్కెటుదార్లూ, మోసగాళ్ళూ మాత్రం కనిపిస్తారు ఎక్కడపడితే అక్కడ మా దేశంలో” అన్నాడు పురుషోత్తం నోరుజారి! వాడు ఆ మాట అనేసినా, అవతలి పెద్దమనిషి, చాలా మోతాదుగా తొందరపడకుండా ఆలోచించే మనిషి కావడాన్ని ఏమో యుద్ధంవల్ల ప్రపంచంలో ఇంచుమించు అన్ని దేశాల్లోనూ అంతే— అన్నాడు—ఆతర్వాత తను కొంచెం వెనక్కి పడ్డాడు - పురుషోత్తమూ ఆ పాశ్చాత్యుడూ ముందు కొన్ని మెట్లు పైన ఆగారు- పురుషోత్తం భక్తికీర్తన ఒకటి ఎత్తుకుని కీరవాణి రాగం ఆలాపన చేస్తున్నాడు. ఆ విదేశీయుడు వింతగా వింటూండగా - చల్లని గాలుల కదలికతో అలిసిపోయిన తన కాళ్లల్లో సత్తువ చేకూరగానే, మళ్ళీ, తానూ వాళ్ళని కలుసుకున్నాడు. పురుషోత్తం అసలు తొందరగానే కొండెక్కగలడు - తనమూలాన్ని వెనకాడుతున్నాడు గాని!—ఆ విదేశీయుడు కూడా ఏదో సొంత పద్ధతిని తేలికగానే ముందుముందుకు పోయి వెనక్కి తనకేసి వింతగా చూస్తుండేవాడు. తను దిగాలుపడిపోయి, ఇంకా నాలుగోవంతైనా ఎక్కందే అన్ని కొండలూ ఎలాగ ఎక్కడంరా అనీ, తలపెట్టిన తర్వాత, మళ్ళీ వెనుదీసేమాట ఆలోచించకూడదనీ నిశ్చయం చేసుకునేలోపల ఆ తెల్లవారుజాము వెన్నెల్లో కొండదారి వంపుల్లోంచి గుంపులు గుంపులు పల్లెప్రజ ముప్ఫయి నలభైయ్యేసిమంది నెత్తిన గంపలూ, మూటలు, బుజాలపైని పిల్లలూ, ముసిలీ, పడుచూ, ఆడా మగా, పిల్లా మేకా బిలబిలలాడుతూ భగవన్నామాలు గొంతెత్తి ఉచ్చరిస్తూ తనూ పురుషోత్తమూ అలుపు తీర్చుకొనేలోగానే కొండదారి ముప్ఫయి నలభయి మెట్లు దాటి మూడు నాలుగు వంపులు తిరిగి పైపైకి పోతుండేవారు దాంతో వేడెక్కిన ఒళ్లూ కాళ్లూ కొంత సేదదీరి చల్లగాలి పీల్చుకుని, సత్తువ తీసుకుని మళ్ళీ పైనం సాగించేవారు. ‘ఈ జనం అందరికీ ఎంత పట్టుదలో’ అనుకోవాలో, ‘ఆ దేవుడికి ఎంత ఆకర్షణో’ అనుకోవాలో ఒకపట్టాన తేలలేదు శేషావతారానికి తెల్లవారగట్ల —ఇప్పుడైతే అన్ని సందేహాలూ మబ్బు విడిపోయినట్లు విడిపోయాయి గాని, ఈ పురుషోత్తం ఇంకా మరచెంబు కొనుక్కొని రాలేదు.....ఆ పాశ్చాత్యుడు ప్లాట్ ఫారంమీద ఎవరితోనో అంటున్నాడు. పొద్దున్న పురుషోత్తం చెప్పిన మాటలే. “ఈ క్షేత్రానికి అసంఖ్యాకంగా దేశ విదేశ యాత్రికులు రావడం ఈనాడు మాత్రమే కాదూ, పదిపండ్రెండు శతాబ్దాలనుంచీ కూడా ఈ కొండదేవుడి మహిమ తెలిపే చరిత్ర శాసనాలు వున్నాయిట” అనీ, పురుషోత్తం చాలా చెప్పేడతనికి - వాడికి చాలా తెలుసు. ఒక మనిషికే ఇన్ని తెలిసుండడం ఎలా సాధ్యమో - అని అతనికి ఆశ్చర్యం కూడా కలిగింది. అసలు తమ స్నేహితుల్లో ఆశ్చర్యం వేస్తుంది పురుషోత్తానికి ఇన్ని సంగతులు తమకే ఎలా తెలుసా అని-వాడు పుట్టినదాది ఎన్ని క్షేత్రాలు, ఎన్ని దేవుళ్ల



తిరునాళ్లు దర్శించాడో లెక్కలేదు. అన్ని క్షేత్రాల్నీ గురించీ, అందరు దేవుళ్ళను గురించీ ఆయా గ్రంధాల్లోని పద్యాలు అవలీలగా ఏకరువు పెడతాడు - ఇవన్నీ చెప్పడమే కాకుండా పురుషోత్తం పలస్తీన్‌లో యాత్రలు, అమెరికాలో నదీ యాత్రలూ, కొండలయాత్రలూ, కొండెక్కడాలు సముద్రతీరాల సెలవురోజులు గడపడం, వీటినిగురించి తను పత్రికల్లో చదివిన విషయాలన్నీ ఆ విదేశీయుడికి పోల్చి చెప్పి, వాటి వివరాలు అడిగేసరికి అతను ఎంతో ముచ్చటపడ్డాడు - కొండెక్కాక తిరణాల జనసమ్మర్దంలో స్నానాలైన వెంటనే గుళ్లోకి వెళ్ళేముందు తానూ పురుషోత్తమూ ఎడమెడమైపోయారు - ఆ విదేశీయుడు, కెమేరాతో పుష్కరిణివొద్దున ఎదురై ఏడీ మీ స్నేహితుడూ అనడిగాడు మబ్బులు విడిపోయి కృష్ణపక్ష పాడ్యమి చంద్రగోళపు అంచుని మళ్లీ స్టేషన్ ప్లాట్ ఫారమూ గానిపైన కెమేరాతో ఆ విదేశీయుడు, తనని చేత్తో తట్టి, "మిస్టర్ - ఏడీ మీ స్నేహితుడూ" అనడిగాడు. శేషావతారం కళ్లు నులుంకుంటూ లేచి, "మరచెంబు కొనుక్కుని వస్తానని - ప్లాట్ ఫారం బైటికి పోయాడు" - అన్నాడు - ఆ విదేశీయుడు "ఏమిటి? పొద్దున్న పుష్కరిణి వొద్దున ఎదురై అడిగినప్పుడు జనంలో పోయిందని వెతుక్కుంటూ వచ్చాడు కాదూ - ఇంకా దొరకనే లేదన్న మాట" ఆ వృత్తాంతమంతా, ఆయన పక్కని తనతో మాటాడుతున్న పరిచితోద్యోగితో చెపుతున్నాడా విదేశీయాయన. కొండలన్నీ యెక్కి తిరునాళ్ళలో ముంచుని ముంచుని, తర్వాత తిరిగి తిరిగి అలిసిపోయిన శేషావతారం మరచెంబు కథ వింటూ వింటూ మళ్ళీ చంద్రగోళంలో పడ్డాడు. చంద్రగోళం అంతా పెద్ద పుష్కరిణిలా వుంది. చుట్టూ యాత్రికులు స్నానాలు చేస్తున్నవారు స్నానాలు చేసి, గుళ్లోకి వెళ్లేవారూ వచ్చేవారూను. తను పురుషోత్తంకోసం వెదుకుతున్నాడు. పుష్కరిణి మధ్య మంటపం - పుష్కరిణి చుట్టూ - ఆలయపు గోడపైని శిల్పఋషులు వారి భుజాలపైని వేళ్లాడుతూ కోతులు - ఒక యాత్రికురాలి భుజంమీంది రాగిచెంబు లాక్కుని - ఒక కోతి ఆ ఋషీశ్వరుడి నెత్తిమీద పెట్టుకుని కూచుంది - ఆ అమ్మాయి తెప్ప తిరునాళ్లకి దేవుడా పుష్కరిణికి వచ్చినప్పుడిద్దామని అరటిపళ్ళు ఆ రాగిచెంబులో పైకి కనబడేలాగ పెట్టుకుంది, పాపం - హనుమంతుడు ఇష్టపడిం తర్వాత ఆయన గారికి దొరికితే తిరిగి ఇస్తాడా! - మరచెంబు కనబడలేదని వెతకడానికి పోయిన పురుషోత్తం ఇంకా రాలేదు. ఆ అమ్మాయి బంధువులూ - పిల్లలూ ఆ కోతిని - నయానా భయానా బెదిరించి - చూస్తున్నారు చెంబు పడేస్తుందా లేదా అని! - ఉత్సవం వచ్చేస్తోంది - స్వామీ అమ్మవారూ పీతాంబరాలు ధరించి, ధగధగ మెరిసే కిరీటంతో నవరత్నాలు తళుకు తళుక్కునే నగలతో దేదీప్యమానంగా వస్తున్నారు! మల్లే, కనకాంబరం, బంతి, చేమంతీ, మరువం, దవనం, అన్నీ కదంబంగా అల్లిన తెప్ప - ఆ తెప్పలో మంత్ర పురస్సరంగా లోకేశ్వరుడూ, లోకమాతా ఆసీనులయారు! - భగవన్నామస్మరణతో భూనభోంతరాలు ప్రతిధ్వనించాయి.

ఆయన పురుషోత్తముడూ ప్రకృతి శ్రీ మహాలక్ష్మి అని కొండెక్కుతూంటే విదేశీయ యాత్రికుడితో పురుషోత్తం చక్కగా వివరించి చెపుతున్నాడు ఏరి వాళ్ళిద్దరూ ఎక్కడ? మర చెంబు దొరికిందా? - చంద్రగోళపు అంచులు కరిగి ప్లాట్ ఫారంమీద విదేశీయుడు పరిచితోద్యోగితో ఆడుతున్న మాటలు వినబడుతున్నాయి. 'ప్రకృతి, పురుషుడు', 'పరమాత్మ, జీవాత్మ', అనే మాటలు ఆ ఉద్యోగి తిరిగి తిరిగి బోధిస్తు

# ★ తిరునాళ్ళు ★

న్నాడాయనకు - శేషావతారం జీవాత్మ తన భౌతిక శరీరంలో కొత్త ఇటు వత్తిగిల్లి, అటు వత్తిగిల్లి నోరు తడిచేసుకుని మళ్ళీ వెల్లకిలబడింది. చంద్ర పుష్కరిణి - ముఖమంటపంవైపు వేదమంత్రచ్ఛాటనతో మెల్లమెల్లగా పయనిస్తున్న ఆది దంపతుల పూలనావ- శేషావతారంచేతు లప్రయత్నంగా కలుస్తాయి. ఎంత సగుణరూపాన్ని చూసినాకూడా దైవసన్నిధిని కన్నులప్రయత్నంగా మూతలే పడుతా యెందుకో! - ఎదుట దైవప్రతిమూర్తి సగుణాకారములో సాక్షాత్కరిస్తున్నా కూడా ఎందుకో ఈ కనుమూత? తన కర్థంకాలేదు. గర్భగుడిలో ధర్మదర్శన వేళా అంతే—పురుషోత్తం అయితే ఇలాటి సందేహాలకి త్వరత్వరగా సమాధానా లిచ్చేస్తాడు. "మన దేశంలో బుద్ధిజీవులైన తపస్వులకు మహా ఋషులకు, నిర్గుణాకార పరబ్రహ్మమును మానసికంగా ఉపాసించడం అవలంబనీయమని బోధించారు. ఆవిధంగా మానసికంగా ఉపాసించదగిన సునిశిత ధారణాశక్తులులేని సామాన్య పామరజనం కంటెదుట అలంకృతమైన దివ్యసుందర విగ్రహామూర్తులను అర్చిస్తారు! మా శేషావతారంలాంటి మధ్యతరగతిమనిషి ఇటు పూర్తిగా పండితుడూ అటు పూర్తిగా పామరుడూ కాలేక, ఎదురుగా భగవంతుని దివ్యసుందరవిగ్రహాముసు పెట్టుకొని కళ్ళు మూసుకొనే చేతులు జోడించడం పరిపాటి" —అని. —ఇదే సందేహం వచ్చిన విదేశీయ యాత్రికుడికి పురుషోత్తం బోధించాడు గర్భగుడివద్ద. ఇది అతనికి నచ్చినట్లేఉంది. చంద్రగోళం కరిగి - ప్లాట్ ఫారమ్ మీద కూచున్న విదేశపాయన ఆపక్క పరిచితోద్యోగితో సగుణోపాసన, నిర్గుణోపాసన అని ఆవిషయాలే చెబుతున్నాడు — ఇంతలో సెకండ్ బెల్ అయింది!-ఒకళ్లిద్దరు పోర్టర్లూ, ప్లాట్ ఫారంమీద పచారు చేస్తున్న కొందరు యాత్రికులూ ప్లాట్ ఫారపు అవతలికొసవైపు మెడ్కులు నిగిడించి చూశారు: మెల్లగా కదుల్తూన్న కృష్ణపక్షపాడ్యమి చంద్రుడులాగ ముందు దివ్వటీ దీపంతో స్టేషనుకి కొన్ని ఫర్లాంగుల దూరంలో నే వస్తున్న రైలుబండిని! కొండ మెట్లన్నీ ఎక్కి దిగి, తిరునాళ్లు అవుతున్నంతసేపు గుంపులో నుంచుని తిరిగి తిరిగి అలిసిపోయిన యాత్రికుడిలాగ మెల్లిగా రొజుతుంటూ వస్తూన్న రైలుబండిని చూశారు జనమంతా! - ఎక్కణ్నుంచో ప్లాట్ ఫారం కటకటాలనీ, జనాన్నీ దూసుకుంటూ తారాజువ్వలాగ పరుగున వొగర్చుకుంటూ పురుషోత్తం వచ్చిపడ్డాడు మరచెంబుతోటి! శేషావతారం తలకిందిమూట చేత పుచ్చుకుని లేచినిలబడ్డాడు-బండివచ్చి ప్లాట్ ఫారంపైని ఆగింది. యాత్ర పూర్తి చేసుకుని కొద్దో గొప్పో పుణ్యం మూట కట్టుకున్న తైర్థికులంతా రైల్లో చోటు కోసం కిందా మీదాపడి తోడలు తొక్కుకున్నారు. శేషావతారమూ, పురుషోత్తమూ మూటలతో మరచెంబుతో ఎలాగైతేయే

(55-వ పేజీ చూడండి)


# భారతి

## జూన్ నెల సంచిక

### ప్రత్యేకాకర్షణలు

**: కథలు :**

ప్రపంచకథానికల పోటీకి నిల్చిన కథలలో ప్రత్యేక ప్రాభవంగల రెండు రచనలు :

సమయం మించిపోయింది : వాసమూర్తి
మూడు తరాలు : శ్రీ అంగర వెంకటకృష్ణరావు

**ఇతర కథలు :**

ఒక పొద్దు పొడిచింది : శ్రీ ఘట్టి కృష్ణమూర్తి
గాలిలో దీపం : యస్. ఆర్. నంది

**వ్యాసములు :**

ప్రవాసము-ఊర్వశి : శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు
కాంచీపురము : శ్రీమతి వారణాసి యశోదాదేవి
ఆంధ్రాదినదాల ఆవిష్కరణ : శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు
రాజేంద్రవర్మ పాడలి శాసనము : శ్రీ మండ నరసింహము

**కవిత :**

విభీషణ శరణాగతి : శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య
విషమ విస్మృతి : దేశిరాట్ విరాట్

**త్రివర్ణచిత్రము :**

పురరాగమనము : శ్రీ రణవీర్ సాక్సేనా

వెల రు. 1—0—0. పోస్టేజి ప్రత్యేకం.
మానేజర్, ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

# తిరునాళ్ళు

(8-వ పేజీ తరువాయి)

చెంబునే చేతైనా సంపాదించారు - ఆ గాఢభ్రాతృత్వసోదరుడుకూడా తన కెమేరాతో సహా వాళ్లెక్కిన పెట్టెలోనే యెక్కాడు, రైలు కదిలేసమయానికి అంతా కుదుటపడి. కూర్చునో, ఒకళ్లో నొకళ్లు చేరగిలబడో, సర్వజన సౌదర్యభావం పెనవేసుకు పోయిందపో అన్నట్లుగా ఒకరినొకరు అన్యోన్యం హత్తుకుని కూర్చున్నారు - విదేశీ యాత్రికుడు పురుషోత్తాన్ని చూసి "మరచెంబు సంపాదించేవే" అని ప్రశంసా సూచకంగా తల పంకించాడు. "పురుషోత్తం, చిట్టచివరికి కొన్నావుట్రా, మరచెంబూ" అని అడిగాడు శేషావతారం మరచెంబు చేతపుచ్చుకుని. "ఏమైన చెంబేరా బాబూ యిది. ఒక సుబ్రాయి అమ్మ చూపాడు చవగ్గాను - ఇదిగో - పి. పి. భాగ్యమూర్తుల పురుషోత్తం పేరు పోడి అక్షరాలు" అన్నాడు! - రైలు కదిలింది;- మళ్ళీ కొండలమీంచి చల్లగాలి కిటికీలోంచి కొడుతోంది! మహానుభావుడి భాగ్యం చేసుకున్నాంరా... ఈవేళ అన్నాడు శేషావతారం. సుభ్రంగా కొత్తగా కనిపించేటట్లు తోముడంవల్ల ధగధగా పాడ్యమీ చంద్రుడిలా మెరిసే మరచెంబు పరిశీలిస్తూవుంటే చుట్టుపక్కల ప్రయాణీకుల సంభాషణలు మాత్రం మెల్లిమెల్లిగా శేషావతారం మనస్సులో చిన్న చిన్న సుడిగుండాలు తిరుగుతూ కరిగిపోనారంభించాయి - రైలు కిటికీలోంచి ఎదురుగా కనిపించే చంద్రలోకంలోకి శేషావతారం అర్ధనిమీలితుడై తేలిపోయాడు - రైలు దిగి ఇంటికివెళ్ళి చేరుకోగానే - అతని భార్య ఎదురేగి "ఏమండీ, దేవుడికి ఏమని దణ్ణం పెట్టుకున్నారో చెప్పరూ" అనడుగుతోంది, ప్రసాదం లందిపుచ్చుకుంటూ! - "ఏమని పెట్టుకున్నానూ, ఏమని పెట్టుకోలేదే..." శేషావతారం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు- "దేముడికి నమస్కరించినప్పుడల్లా మనస్సు నిర్మలమై నిశ్చలమైపోయి పైకి చూసిన ఆ మూర్తిని మళ్ళీ మనస్సులో ధ్యానించి తన్మయుం కావడం తప్ప-ఫలానా కోర్కె కావాలని కోరలేదే - ఏవిరా పురుషోత్తం - ఈ సంగతి చెప్పు" అని పక్కకి తిరిగేసరికి చంద్రలోకం కరిగి - రైలు పెట్టెలో కూచున్న పురుషోత్తం పక్క అతనికి బోధిస్తున్నాడు; - "రోజూ నాకు తిండియ్య బట్టయియ్య అని అడగడం కంటె చిరునవ్వుతోనో కృతజ్ఞతతోనో తండ్రియైన భగవంతునితో తాదాత్మ్యం పొందడమే సరసుకుంటాను" అని. అయితే, ఇంటికెళ్ళాక మా ఆవిడ అడిగితే ఆమెకి అలాగే చెప్తాను" అనుకుని మళ్ళీ చంద్రలోకానికి తేలిపోయాడు శేషావతారం. ★

# ★ కాలక్షేపం ★

(5-వ పేజీ తరువాయి)

తనకు బాల్యదశలో మృత్యుగండం తప్పించవలసినదని యీశ్వరుణ్ణి ప్రార్థించారుట. ఆ ప్రాణగండం ఆయనకు తప్పింది. ఆయన చిరంజీవియైనాడు. శాశ్వతంగా చిరకాలం బ్రతికిఉండడం ఎందుకయ్యా అంటే, భగవద్భజన శాశ్వతంగా ఎల్లకాలమూ చేస్తూ ఉండడానికి ఈ చేతులు ఉండాలి, యీ నాలుక ఉండాలి, యీ కాయము స్థాయముగా ఉండాలి అన్నాడు.

కనుక "తనువుపై మన కింత తనుకమేల?" అనే ప్రశ్న అనవసరం. శరీరం అనేది ఉండితీరాలి. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి అన్నారు మహాత్ములు. ప్రతిరోజూ డాక్టరుచేత విధిగా పరీక్ష చేయించుకొని తన రక్తపుపోటు తగ్గిందో హెచ్చిందో చూచుకొని, అతిశ్రద్ధగా ఆహార విహార నియమం గమనిస్తూ, క్షణభంగురమైన శరీరంమీద క్షణక్షణమూ శ్రద్ధాసక్తి చూపించిన మహాత్ముగు, వారాలకొలది నిరాహార దీక్ష, నిరాక్షేపణగా, నిశ్శంకగా, నిరభ్యంతరంగా, నిర్మొగమాటంగా సాగించి శరీరాన్ని నిర్లక్ష్యం చేశాడు.

సీతమీద ఎంత అనురక్తి, ఎంత ఆసక్తి, ఎంత మోహం, ఎంత మమకారం శ్రీరాములవారికి ఉన్నదని వ్యక్తమైనదో చూడండి. ఆ యిల్లాలును నిండు చూలాలైయుండగా వనవాసానికి వాల్మీకాశ్రమానికి శ్రీరాముడు పంపించినప్పుడు అంత అనురక్తి అంత ఆసక్తి, అంత మోహం అంత మమకారం ఏమైంది? మహాత్ముడు తన దేహపోషణ ఎంత శ్రద్ధగా చేశాడో, శరీరాన్ని ఎన్ని తైలాలతో మర్దన చేశాడో, తన తూకం ఎంత శ్రద్ధగా చూచుకున్నాడో, ఎన్ని ఫలరసములను బలంకోసం స్వీకరించాడో, గమనిస్తే శరీరం అంటే ఆయనకుఅంత మక్కువ కాబోలునని మనము ఒటుకున్న ఒక్క మాటలో అంటాము. కాని, ఢిల్లీలో బిర్లా భవనఆవరణలో సాయంకాల ప్రార్థన సభలు జరుగుతున్నప్పుడు ఆయనమీద బాంబు వేయాలనే ప్రయత్నం జరిగింది. జరిగినట్లుగా మహాత్మునకు తెలియజేశారు. సాయంకాల ప్రార్థన సమావేశాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని మంత్రియైన వల్లభాయి పటేలు బ్రతిమాలితే ససేమిరా నాకు యీ పోలీసు కాపలా వద్దన్నాడు. నా శరీరాన్ని అవిధంగా రక్షించవలక్కరలేదన్నాడు. భగవంతుని రక్షణ కావాలి గాని భటుల రక్షణ అక్కరలేదన్నాడు.

శరీరప్రకృతిమీద ఉండే అనురక్తి ఎంతవరకో ధర్మసాధనకోసం శరీరాన్ని ఉపయోగించే మహాత్ములకే బోధపడుతుంది. ప్రకృతి అంతా సహధర్మచారిణివలె కన్పిస్తుంది. సృష్టిఅంతా మనోహరంగానే ఉంటుంది. మల్లెలు మొల్లలు మందమారుతములు మాత్రమే కాదు; తేళ్ళు మొసళ్లు, రేచులు, తామలు, తుపానులు, భూకంపాలుకూడా మనోహర భగవత్ చిద్విలాసాలుగా కన్పిస్తాయి. బ్రహ్మానందం కలుగజేస్తాయి. ఎవరికి?- బ్రహ్మజ్ఞానులైన బ్రహ్మర్షులకు. బ్రహ్మమయం అయిన ప్రకృతిని చూచి ఆనందించే పురుషుడు బ్రహ్మకాకపోయినప్పటికీ, ఆ బ్రహ్మకు సాహసమైన హంస అయినా కావాలి. అటువంటి పరమహంసకు మనస్మరవికారం గాని, "నేను అనుభవించాలి" అనే కాముంతో, కోరికతోకూడిన అనురాగం గాని ఉండదు. ప్రకృతి అనేది స్త్రీవంటిదే. కాని ఆ స్త్రీ రామకృష్ణ పరమహంసకు జగజ్జననిగా మాతృస్వరూపంలో కన్పించింది. భక్తుడైనవాడు తానుకూడా స్త్రీతత్వం పొందుతాడు. అంతా ఒకటే ప్రకృతి ఒకటే తత్వం—రామకృష్ణ పరమహంసకు ఆయన సహధర్మచారిణియైన శారదాదేవియందు జగన్మాత కన్పించింది. ఆయనకూడా దేవివలెనే వేషం వేసికొని ఆనందించి తన్మయుడైన సమయాలు ఉన్నాయి. అంతా స్త్రీమయం అంతా దేవీమయం అన్నాడు. ఒకసారి కలకత్తాలో గుర్రపుబండిలో ప్రయాణం చేస్తూ దేవిని తానే అనితన్మయుడైపోయినాడు స్వయంగా చూచిన ఒక బ్రహ్మసమాజికుడు వివరించినవిషయం ఇది.

భక్తుడు పురుషుడే. కాని స్త్రీభావంలోకి మారి శరణాగతుడైనప్పుడే పూర్తిగా భక్తుడవుతాడు. పురుషుడే స్త్రీయైన తర్వాత ప్రకృతి అంతా ఆ పురుషునకు తల్లికానాలి, తండ్రికావాలి. లేదా భర్తకావాలి. తన భోగంకోసమే యీ సృష్టి అనే భావం అభావం అవుతుంది.

"మదీయ భాసుర సముద్పృష్టి బ్రహ్మముగ జూచుచు నున్న ది విశ్వమంతయున్." అనే మహాత్ముడు శత్రువులను మిత్రులను ఒక్కరీతిగా చూస్తాడు. గాంధిమహాత్మునిపై రివాల్వరు పేల్చిన నాధూరాం వినాయక గాడ్సేలో కూడా భగవంతుడున్నాడు. "ఇదే మహాత్ముని జీవితాంత్య సందేశం" అంటె లవలేశం సంశయం లేదు.

"మదీయ భాసుర సముద్పృష్టి బ్రహ్మముగ
జూచుచునున్నది విశ్వమంతయున"

అని మహాత్ముడు అనగలైనను మాట యుగాని టికీ నిజం. ★